సాక్షి నిర్మల్

బుధవారం। 9। ఏప్రిల్। 2025

ఇలా.. ఇంకెన్నేళ్లు..!? 8లో▸



తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన రాంజీ గోండ్ సహా వెయ్యిమంది వీరుల త్యాగాలకు గుర్తింపు దక్కడం లేదు. బుధ వారం రాంజీసహా వెయ్యిమంది వీరుల త్యాగాలదినం సందర్భంగా ప్రత్యేక కథనం.



కీరదోస..ఉపాధికి భరోసా

లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌లో కీరదోస సాగుకు కేరాఫ్‌గా నిలుస్తోంది. గ్రామ రైతులే సాగుచేసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. లాభాలు ఆర్జిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
38.7 /26.6

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. రాత్రి కూడా వేడిగానే అనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మత రాజకీయాలను తిప్పికొడదాం



కలెక్టరేట్ ఎదుట నిరసనలో నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ మత రాజకీయాలను తిప్పికొడదామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. మోదీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కార్ ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. 44 చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. జాతీయ నూతన అగ్రి ముసాయిదా రైతాంగానికి వ్యతిరేకంగా ఉందని, ఈ కొత్త వ్యవసాయ బిల్లులో 23 వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధర ప్రస్తావన కూడా లేదన్నారు. నిరసనలో జిల్లా నాయకులు ఆర్.రామలక్ష్మణ్, ఎం.బక్కన్న, కె.రాజన్న, లక్ష్మి, ఎస్.గంగన్న, వి.మహేందర్, పీవో డబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, నాయకులు జక్కుల రాజన్న, అడ్డకట్ల శంకర్, భీమ్‌రావు, గోరేభాయ్, ఫెరోజ్ పాల్గొన్నారు.

ఆర్పీలపై కేసు

నిర్మల్‌టౌన్: స్వయం సహాయక సంఘాల ఆర్పీలపై కేసు నమోదు చేసినట్లు స్పెషల్ ఎస్సై సంజీవ్ తెలిపారు. నిర్మల్ పట్టణంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళల నుంచి ప్రతీనెల బ్యాంకుకు కట్టాల్సిన డబ్బులను ఆర్పీలు సైరాభాను, కవిత, జ్యోతి, రజిత, విజయ బ్యాంకుకు చెల్లించకుండా వాడుకున్నారని మెప్మా పీడీ సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.80 లక్షలకుపైగా బ్యాంకుకు చెల్లించలేదని ఫిర్యాదులో తెలిపారు. దీంతో జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మంగళవారం విచారణ చేశారు.

బాండ్ రెన్యూవల్ చేయాలి

ఖానాపూర్: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు అన్ని రాష్ట్రాల తరహాలో ప్రభుత్వం వెంటనే బాండ్ రెన్యూవల్ చేయాలని ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు వి.రాంచందర్ కోరారు. మంగళవారం మాట్లాడుతూ ప్రభుత్వం తమను రెన్యూవల్ చేసినప్పుడే తాము క్రమం తప్పకుండా విధుల్లో ఉన్నట్లు ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ సర్వీసును కోల్పోయేలా అటెండెన్స్‌ను మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తమ సంఘం జేఏసీ పిలుపుమేరకు సీఎం రేవంత్‌రెడ్డికి స్పీడ్‌పోస్ట్ ద్వారా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో జరుగుతున్న పరిణామాలను, తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేశామన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ కింద పనిచేస్తున్న తమకు ప్రాజెక్ట్ డైరెక్టర్ వ్యవహరిస్తున్న తీరుతో నష్టం జరుగుతోందని తెలిపారు.

ఘనంగా తెప్పోత్సవం



గోదావరిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఖానాపూర్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సీతారామచంద్రస్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు కీర్తి రాఘవశర్మ వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి స్థానిక గోదావరిలో తెప్పపై స్వామివారి విహరించారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులతోపాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిలిచిన 'మిషన్ భగీరథ'



భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాలకు రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావ డం లేదు. ముందస్తు సమాచారం లేకుండా నీటి సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. చేతిపంపులు, పక్కింటి వారి బోరు నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వేసవి కాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు.



సోన్ మండలం సంగంపేటలో ముగ్గు పోసిన ఇందిరమ్మ ఇల్లు

పునాది దాటని ఇందిరమ్మ

- ఫైలట్ ప్రాజెక్టుగా 18 గ్రామాల్లో 1,539 మంది ఎంపిక
- 1,539 గృహాలకు, 942 గ్రౌండింగ్
- ముగ్గు పోసినవి 149, బేస్మెంట్ దశలో 5..
- నిర్మాణానికి ఆసక్తి చూపని లబ్ధిదారులు

జిల్లాలో మొత్తం వచ్చిన దరఖాస్తులు : **1,92,233**
మొదటి విడత ఎంపీడీవోలు సబ్మిట్ చేసిన దరఖాస్తులు : **1,539**
కలెక్టర్ అప్రూవల్ చేసిన దరఖాస్తులు : **942**
పెండింగ్ దరఖాస్తులు : **886**
ఇప్పటివరకు ముగ్గు పోసినవి : **149**
బేస్మెంట్ లెవెల్లో ఉన్నవి : **5**

నిర్మల్‌చైన్‌గేట్: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మల్ జిల్లాలో అడ్డంకులు ఎదుర్కొంటోంది. 18 మండలాల్లో 18 గ్రామాల్లో 1,539 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే కఠిన నిబంధనలు, నిధుల కొరత, ఇసుక సమస్యలతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

నిర్మాణాల్లో జాప్యం..

పైలట్ ప్రాజెక్ట్‌లో ఎంపికైన 1,539 మందిలో కేవలం 149 మంది మాత్రమే ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. వీరిలో కేవలం ఐదు గృహాలు బేస్‌మెంట్ స్థాయి వరకు చేరాయి. మిగిలినవారు ఆర్థిక ఇబ్బందులు, ఇసుక కొరత, మొదటి విడత నిధుల ఆలస్యం వంటి కారణాలతో నిర్మాణం ప్రారంభించలేకపోతున్నారు. 942 మందికి గ్రౌండింగ్ పూర్తయినప్పటికీ, నిర్మాణం నత్తనడకన సాగుతోంది.

నిధుల సమస్య

ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు మంజూరు చేసినప్పటికీ, 400–500 చ.అడుగుల విస్తీర్ణంలో మూడు గదులు, సీసీ స్లాబ్‌తో ఇల్లు నిర్మించాలన్న నిబంధన లబ్ధిదారులకు భారంగా మారింది. నాలుగు దశల్లో బిల్లుల చెల్లింపు విధానం కూడా సమస్యగా మారింది. ఈ నిబంధనలు చాలామందిని నిర్మాణానికి ఆసక్తి చూపకుండా చేస్తున్నాయి.

అర్హుల ఎంపికలో పురోగతి

జిల్లాలో 1,92,233 దరఖాస్తులు అందగా, ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా సర్వే చేసి అర్హులను మూడు విభాగాలుగా (ఎల్–1, ఎల్–2, ఎల్–3) విభజించారు. సొంత స్థలం ఉన్నవారిని ఎల్–1గా, స్థలం లేనివారిని ఎల్–2గా, ఇతరులను ఎల్–3గా గుర్తించారు. అయినప్పటికీ, పైలెట్ ప్రాజెక్ట్‌లో ఎంపికైనవారు కూడా నిర్మాణం చేపట్టలేకపోతున్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా 1,539 మందిని ఆయా ఎంపీడీవోలు గుర్తించారు. ఇప్పటి వరకు 942 గ్రౌండింగ్ పూర్తయ్యాయి. పేదల కలలను నిజం చేయాలన్న లక్ష్యంతో ప్రారంభమైనప్పటికీ నిబంధనలు, నిధుల కొరతతో నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం సరళ నిబంధనలు, నిధుల విడుదలతో ఈ పథకాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

పైలట్ గ్రామాల్లో పనులు ప్రారంభం..

జిల్లాలోని పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాం. 18 మండలాల పరిధిలో 149 మంది లబ్ధిదారులకు ముగ్గు పోశాం. వారు నిర్మాణపు పనులు చేపట్టారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసిన వారికి త్వరలోనే డబ్బులు ఖాతాల్లో జమ చేస్తాం.

– రాజేశ్వర్, హౌసింగ్ పీడీ

నిలిచిన నట్టల మందు పంపిణీ

- రెండేళ్లుగా అందని ఉచిత మందులు
- ప్రైవేటుకు వెళ్తున్న పశు పోషకులు



చింతల్‌చాంద వద్ద గొర్రెలు

లక్ష్మణచాంద: జిల్లాలో పశువులకు గతంలో ఏటా రెండు విడతల్లో నట్టల నివారణ మందు ఉచితంగా పంపిణీ చేసేవారు. రెండేళ్లుగా ఉచిత పంపిణీ నిలిచిపోయింది. దీంతో పశుపోషకులు ప్రైవేటుకు వెళ్తున్నారు. ఆర్థికంగా నష్టపోతున్నారు. గతంలో ప్రభుత్వం తరఫున పశువైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గొర్రెలు, మేకలు, గేదెలకు నట్టల నివారణ మందులు అందించేవారు. ప్రస్తుతం కార్యక్రమం ఆగిపోవడంతో పశువులు నట్టల వ్యాధి బారిన పడి ఎదుగుదల సరిగా లేక, ఆర్థిక నష్టాలు తప్పడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు ఆరోగ్య సమస్య

నట్టలు (పరాన్న జీవులు) పశువుల పేగుల్లో రక్తాన్ని తాగడం వల్ల గొర్రెలు, మేకలు, గేదెల ఎదుగుదల తగ్గుతుంది. గతంలో ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు నట్టల నివారణ మందులను ఉచితంగా అందించేది, దీంతో ఈ సమస్య నియంత్రణలో ఉండేది. ఇప్పుడు ఈ కార్యక్రమం లేకపోవడంతో రైతులు ప్రైవేటు మందులను కొనుగోలు చేయవలసి వస్తోంది, ఇది ఆర్థిక భారాన్ని పెంచుతోంది.

పునఃప్రారంభించాలని వినతి..

నిర్మల్ జిల్లాలో 3.42 లక్షల పశువులు (48,496 ఆవులు, 55,024 గేదెలు, 1,98,486 గొర్రెలు, 40,755 మేకలు) ఉన్నాయని పశుసంవర్ధక శాఖ తెలిపింది. ఈ పశువుల ఆరోగ్యం కోసం నట్టల నివారణ మందులు అవసరం. ప్రభుత్వం వెంటనే గత కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని పశుపోషకులు కోరుతున్నారు. దూడలకు 7 రోజుల లోపు మందులు ఇవ్వడం, పేడ పరీక్షల ద్వారా నట్టలను గుర్తించడం వంటి చర్యలు తీసుకుంటే మరణాల రేటు తగ్గుతుందని వారు సూచిస్తున్నారు.

జిల్లాలో పశువుల వివరాలు..	
ఆవులు **48,496**	గేదెలు **55,024**
గొర్రెలు **1,98,486**	మేకలు **40,755**
మొత్తం **3,42,761**	

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

రాష్ట్ర ప్రభుత్వం నట్టల నివారణ మందుల పంపిణీని రెండేళ్లుగా చేయడం లేదు. మార్చి నెలలో రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విషయమై చర్చించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చి.. మందులు సరఫరా కాగానే జిల్లాలో పంపిణీకి చర్యలు చేపడతాం. – ఎండీ.బాలిగ్ అహ్మద్, జిల్లా పశు వైద్యాధికారి

ఆర్థికంగా నష్టపోతున్నాం



జిల్లాలో రెండేళ్లుగా ఉచిత నట్టల నివారణ మందులు ప్రభుత్వం ద్వారా అందడం లేదు. ప్రైవేటుగా బయట కొనుగోలు చేసి జీవాలకు తాగిస్తున్నాం. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం ఉచిత పంపిణీని ప్రారంభించాలి.

– అశోక్, పశుపోషకుడు చింతల్‌చాంద

వెంటనే ప్రారంభించాలి



గతంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నట్టల నివారణ మందుల పంపిణీ చేసేవారు. గొర్రెలు, మేకలకు ఇతర జీవాలకు మందులు తాగించే వారు. ఇప్పుడు కార్యక్రమం అమలులో లేదు. ప్రభుత్వం వెంటనే నట్టల నివారణ మందులు పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలి. – సుమన్, రైతు ధర్మారం

డీఫ్యాక్టో సీఎం మీనాక్షి నటరాజన్

- రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ డీఫ్యాక్టో సీఎంలా వ్యవహరిస్తున్నారని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ నేరుగా సచివాలయానికి వచ్చి మంత్రులతో కలిసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారాన్ని సమీక్షించడం ద్వారా రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం అని చెప్పకనే చెప్పారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పగ్గాలను రాహుల్‌గాంధీ తన చేతిలోకి తీసుకున్నట్టు అర్థమవుతోందన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న కొత్తలో మీనాక్షి నటరాజన్ ప్రభుత్వ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోనని చెప్పిన విషయం గుర్తు చేశారు. కానీ అందుకు విరుద్ధంగా ఏకంగా సచివాలయానికి రావడం వెనక రాహుల్‌గాంధీ ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోనే తన నివాసంలో ఉండగా మీనాక్షి నటరాజన్ ఏకంగా సచివాలయానికి వచ్చి మంత్రులతో కలిసి రివ్యూ చేయడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి కోరలు లేని పాము అని అర్థం చేసుకోవాలన్నారు. జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ తమ విధానమంటున్న కాంగ్రెస్ పార్టీ.. ఆచరణలో శూన్యమని మీనాక్షి నటరాజ్ నిరూపించారని ఎద్దేవా చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీలుగా పనిచేసిన దిగ్విజయ్ సింగ్, గులామ్ నబీ ఆజాద్, వీరప్ప మొయిలీ, వయలార్ రవి వంటి నేతలు ఏనాడు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సర్కారును రాహుల్ గాంధీ రిమోట్ కంట్రోల్ ద్వారా నడిపించాలనుకుంటున్నారని విమర్శించారు. సకల జనులు కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ చులకన చేస్తోందని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ పాదాల వద్ద తాకట్టు పెట్టడాన్ని రాష్ట్ర ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ గెలిస్తే మార్పు వస్తుందన్నారు. ఇదేనా మార్పు, రిమోట్ కంట్రోల్ పాలనేనా మార్పు అంటే అని ఎద్దేవ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, తాజా మాజీ కౌన్సిలర్లు నరేందర్, నవీన్, పద్మాకర్, సత్యం చంద్రకాంత్ , ముత్యం రెడ్డి, జమాల్, విలాస్, విజయ్, తిరుమలాచారి, ముత్యం పాల్గొన్నారు.

సన్నబువ్వ తిని.. సమస్యలు తెలుసుకుని..

- తర్లపాడ్‌లో సన్న బియ్యం లబ్ధిదారు ఇంట్లో కలెక్టర్ భోజనం



సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో కలెక్టర్ కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం భోజనం చేశారు. ముందుగా ఎస్సీ కాలనీ రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియను అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నాకల్యాణి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. బియ్యం నాణ్యత, రుచి, పంపిణీ ప్రక్రియపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులైన పల్లెర్ల సుజాత–రాజేశ్వర్ దంపతుల ఇంటికి వెళ్లి సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులతో చర్చించిన కలెక్టర్, ఐకేపీ ద్వారా డెయిరీ, పౌల్ట్రీ ఫాంతోపాటు ఇతర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు సన్న బియ్యం తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కాలనీలోని సమస్యలను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేని విషయాన్ని గ్రామస్తులు చెప్పగా, వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీతను కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. యువత రాజీవ్ యువ వికాసం కార్యక్రమానికి దరఖాస్తు చేయాలని, ఇల్లు లేనివారికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు, ఆర్‌ఐలు సత్యనారాయణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ఏఐ విప్లవం..

- నాణ్యమైన విద్యకు తెలంగాణ సంకల్పం
- పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ
- ప్రాథమిక పాఠశాలల్లో బోధన
- జిల్లా నుంచి ఐదుగురికి రాష్ట్రస్థాయిలో శిక్షణ
- వచ్చే విద్యాసంవత్సరం ప్రణాళికలు సిద్ధం



ఇటీవల ఏఐపై శిక్షణపొందిన జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత బోధనను ప్రవేశపెట్టింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు అందించే లక్ష్యంతో, రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రతీ జిల్లా నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఐ బోధనను అమలు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక అమలు కోసం ప్రతీ జిల్లా నుంచి ఐదుగురు ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో డిజిటల్ లిటరసీ, ఏఐ శిక్షణ అందించారు. వచ్చే విద్యా సంవత్సరం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు డిజిటల్ అభ్యసన పరిజ్ఞానం అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

గణితంతో ప్రారంభం

విద్యాశాఖ ఐటీ విభాగం జి కంప్రైస్, ఎడ్యుఆక్టివ్ 8, కోడ్ మిత్ర వంటి ఏఐ యాప్‌లను అభివృద్ధి చేసింది. ఈ యాప్‌ల ద్వారా గణిత పాఠ్యాంశాలను ఉత్సాహభరితంగా నేర్చుకునేలా రూపొందించారు. సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగహారాలను కృత్యాధారంగా బోధించే ఈ పద్ధతి విద్యార్థుల జ్ఞాపకశక్తిని, ఆసక్తిని పెంచుతుందని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు చెబుతున్నారు. వెనుకబడిన విద్యార్థులకు కూడా ప్రేరణ కలిగేలా ఈ యాప్‌లు రూపొందాయి.

దశలవారీగా అమలు

జిల్లాలో ఐదు పాఠశాలలను ఎంపిక చేసి, ఏఐ బోధనకు సన్నద్ధం చేస్తున్నారు. 50 మందికి పైగా విద్యార్థులున్న 535 ప్రాథమిక పాఠశాలలకు దశలవారీగా 5–10 కంప్యూటర్లు సరఫరా చేయనున్నారు. ఈనెల 23న మెగా పేరెంట్స్ మీటింగ్ ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వేగం పుంజుకుంది.

తెలంగాణ ప్రభుత్వం ఏఐ ఆధారిత బోధనతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంచేందుకు కృషి చేస్తోంది. గణితంతో ప్రారంభమైన ఈ చొరవ, భవిష్యత్తులో మరిన్ని పాఠ్యాంశాలకు విస్తరించనుంది. ఈ సంస్కరణలు విద్యార్థుల సామర్థ్యాలను పెంచి, ప్రభుత్వ బడుల బలోపేతానికి దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు ఏఐ ఆధారిత బోధన చేపట్టేందుకు ఇటీవల జిల్లా నుంచి ఐదుగురు ఉపాధ్యాయులను ఎంపిక చేసిన వీరికి ఇదివరకే శిక్షణ పూర్తయింది. రానున్న విద్యాసంవత్సరానికల్లా మరిన్ని బడుల్లో విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. కంప్యూటర్ ఆధారిత బోధన ద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. తద్వారా ప్రభుత్వ బడుల్లో చదివే పేద పిల్లలకు న్యాయం జరుగుతుంది.

– నరసయ్య,సెక్టోరియల్ అధికారి, నిర్మల్ జిల్లా

కాలానుగుణంగా కొత్తపుంతలు..



మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనాభ్యసన ప్రక్రియలో కూడా కృత్రిమ మేధను ప్రవేశపెట్టే విధంగా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే జిల్లానుంచి ఐదుగురు ఉపాధ్యాయుల ఎంపిక చేసి ఇటీవల శిక్షణ ఇచ్చింది.సంప్రదాయ బోధనలో నవ్యత ఏర్పడుతుంది. విద్యార్థులు కూడా నూతన విషయాల పట్ల ఉత్సుకత కనబర్చుతారు. కాబట్టి బోధన ఫలవంతమవుతుంది..

– జి.రాజేశ్వర్, శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు,

వైద్యులు సమయపాలన పాటించాలి

- డీసీహెచ్ఎస్ సురేశ్



రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ సురేశ్

భైంసాటౌన్: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ సురేశ్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఓపీ గదుల్లో వైద్యుల హాజరు, ఓపీ నమోదు, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది హాజరు రిజిస్టర్లు తనిఖీ చేశారు. పలు వార్డుల్లో కలియ దిరుగుతూ ఇన్‌పేషెంట్లకు సంబంధించి కేస్‌షీట్లు పరిశీలించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. ప్రసూతి వార్డులో మూత్రశాల వసతి లేకపోవడంతో, అందుబాటులోకి తేవాలని సూపరింటెండెంట్ కాశీనాథ్‌ను ఆదేశించారు. అలాగే క్యాజువాలిటీలో మందుల నిల్వలు సక్రమంగా నిర్వహించకపోవడం, కట్లు కట్టే గదిలో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే మెమో జారీ చేస్తానని హెడ్ నర్స్, నర్సింగ్ సూపరింటెండెంట్‌ను హెచ్చరించారు. అనంతరం ఫార్మసిస్ట్ గదిలో మందుల నిల్వలు పరిశీలించారు. గడువు ముగిసే మందుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఫార్మసిస్ట్‌ను ఆదేశించారు. ఏ ఓపీ గదిలో ఏ వైద్యుడు అందుబాటులో ఉన్నారో రోగులకు తెలిసేలా రిజిస్టర్ మెయింటేన్ చేయాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు కొందరు రోగులకు తమ ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని ఓ సామాజిక కార్యకర్త ఆయన దృష్టికి తేగా, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

బాసర సీహెచ్‌సీకి స్థలం కేటాయించాలి...

బాసరలో 30 పడకలతో సీహెచ్‌సీ నిర్మాణానికి గ్రామంలో ఐదెకరాల స్థలం కేటాయించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ సురేశ్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌ను కోరారు. భైంసాకు వచ్చిన ఆయన ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. బాసరలో ప్రస్తుతమున్న పీహెచ్‌సీ అర ఎకరంలో మాత్రమే ఉందని, ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా సీహెచ్‌సీ నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని కోరారు. రూ.5.75 కోట్ల నిధులు మంజూరుతోపాటు టెండర్ పూర్తయిందని తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధురాలు అదృశ్యం


పోసక్క(ఫైల్)

కోటపల్లి: మండలంలోని నాగంపేటకు చెందిన పత్తి పోసక్క (68)ఈనెల 5న భర్త పోచయ్యతో కలిసి మొక్కజొన్న చేనుకు కాపలాగా వెళ్లింది. భర్త చేను వద్దే కాపలా ఉండగా వృద్ధురాలు చీపురు పుల్లల కోసమని అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు అటవీప్రాంతంలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోచయ్య మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

బెట్టింగ్ ఆడుతున్న నలుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని సినిమా రోడ్ ప్రాంతంలో గల ట్రెండి కలెక్షన్‌లో పద్మావతి కాలనీకి చెందిన గిత్తె సూర్యకాంత్, దస్నాపూర్‌కు చెందిన పెద్వాల్ పంకజ్, శాంతినగర్‌కు చెందిన నమ్మెవార్ విశాల్, టీచర్స్ కాలనీకి చెందిన అలవత్ బాల్‌దేవ్‌ను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లతో పాటు రూ.2,210 నగదు స్వాధీనం చేసుకుని ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూమి విక్రయిస్తామని మోసగించిన ఆరుగురిపై..

బెల్లంపల్లిరూరల్: భూమి విక్రయిస్తామని మోసగించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన ఒంటెల రవికుమార్‌కు బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి శివారులో 6 ఎకరాల 12 గుంటల భూమి అమ్ముతామని కొందరు వ్యక్తులు చెప్పడంతో వారికి రూ.39.76 లక్షల నగదు అప్పగించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తులు భూమిని రి జిస్ట్రేషన్ చేయకుండా మోసగించారు. దీంతో బాధితుడు సోమవారం రాత్రి తాళ్లగురి జాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బెల్లంపల్లికి చెందిన రాగంశెట్టి సత్యనా రాయణ (సతీశ్), మల్లీశ్వరి, భీమయ్య, శ్రీ కాంత్, జగదీశ్, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపా రు.

కోడిగుడ్ల వాహనం బోల్తా


బోల్తాపడిన మినీ వ్యాన్

నేరడిగొండ: మండలంలోని కొర్టికల్ డొనల్ రోడ్డు ప్రాంతంలో మినీ వ్యాన్ బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. ఆర్మూర్ నుంచి మహారాష్ట్రలోని సార్థాని వైపు మంగళవారం కోడిగుడ్లలోడ్‌తో మినీ వ్యాన్ బయలుదేరింది. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఓ ద్విచక్ర వాహనదారుడు అడ్డురావడంతో డ్రైవర్ తప్పించబోయి ఈ ఘటన చోటు చేసుకుంది. వ్యాన్ రోడ్డుపై బోల్తా పడడంతో అందులోని కోడిగుడ్లు రోడ్డుపై పడి పగిలిపోయాయి. ఘటనలో వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ ఉమేర్‌తో పాటు మరొకరు సురక్షితంగా బయటపడ్డారు.

అత్యాచారం కేసులో నలుగురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బాలిక(12)పై అత్యాచారం చేసిన నలుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికను ఓ వివాహిత ఆదివారం మధ్యాహ్నం సమీప అడవిలోకి తీసుకెళ్లింది. ఇద్దరు యువకులను అక్కడికి వెంటబెట్టుకొని రాగా వారు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. రాత్రి ఇంటికి తిరిగొచ్చిన బాలిక విషయాన్ని తల్లికి వివరించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు యువకులతో పాటు మహిళ, మరో మధ్యవర్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇలా.. ఇంకెన్నేళ్లు..!?


తెలంగాణతల్లి రూపశిల్పి బీవీఆర్‌చారి గీసిన వెయ్యిఉరులమర్రి చిత్రం

- వాళ్ల ప్రాణాలకూ విలువనివ్వరా?
- వెయ్యిమంది త్యాగాలకు లెక్కలేదా?
- అధికారికంగా నివాళులూ అర్పించలేరా?
- 'వెయ్యి ఉరులమర్రి' సాక్షిగా వివక్ష
- నేడు ఆ అమరవీరుల త్యాగాలదినం

వాళ్ల పోరాటం తెలుసుకుంటే రోమాలు నిక్కబొడ్చుకుంటయ్. తమపై సాగిస్తున్న అరాచకాలను ఎదుర్కొనేందుకు.. వారు ముందుకురికిన తీరు రక్తాన్ని ఉడికిస్తుంది. చరిత్ర సైతం గోసపెట్టుకునేలా వారు చేసిన ప్రాణత్యాగాలు కళ్లను చెమరుస్తాయి. వారి వీరగాథ గుర్తుకొచ్చినప్పుడల్లా చేతులు వాటంతటవే జోడిస్తాయి. కానీ.. అలాంటి వీరుల ప్రాణత్యాగాలను ప్రభుత్వాలు చిన్నచూపు చూడటమే కలచివేస్తోందని నిర్మల్ జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గడ్డపైనే పోరాడి, తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన రాంజీగోండు సహా వెయ్యి మంది వీరుల త్యాగాలకు ఇంకెప్పుడు అధికారిక నివాళులర్పిస్తారు..!? అన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం రావడం లేదు. నేడు (ఏప్రిల్ 9) రాంజీసహా వెయ్యిమంది వీరుల త్యాగాలదినం.. – నిర్మల్


జిల్లాకేంద్రంలో రాంజీగోండు విగ్రహం

దేశ ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామానికి కొనసాగింపుగా తెలంగాణ–మహారాష్ట్ర ప్రాంతంలోనూ ఉమ్మడి శత్రువులపై గోండులు, రోహిల్లాలు, మరాఠీలు, దక్కనీలు పోరు చేశారు. నిర్మల్ కేంద్రంగా 1858–60 వరకు ఈ పోరాటం సాగింది. అడవుల్లోకి చొచ్చుకొస్తూ.. ఆదివాసుల ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్న ఆంగ్లేయ, నైజాం సేనలపై జనగాం (ఆసిఫాబాద్) కేంద్రంగా చేసుకున్న గోండువీరుడు మర్సుకోల రాంజీగోండు పోరాటం ప్రారంభించాడు. నిజాం సేనలతో కలిసి నిర్మల్ కలెక్టర్ ప్రజలను పీడిస్తున్నాడని రాంజీగోండు ఈ ప్రాంతం వైపు వచ్చాడు. తాంతియాతోపే అనుచరులైన రోహిల్లా సిపాయిలు ఆయనకు తోడయ్యారు. రోహిల్లా సర్దార్ హాజీతో కలిసిన రాంజీ.. ఉమ్మడి శత్రువులైన ఆంగ్లేయ, నిజాం సేనలపై విరుచుకుపడ్డాడు. సరైన ఆయుధ సంపత్తి లేకున్నా దట్టమైన అడవులు, సహ్యాద్రి కొండలు, గోదావరి నదులను ఆసరాగా చేసుకుని వారిపై దాడులు చేసి దెబ్బతీశారు.

ఒకే మర్రికి.. వెయ్యిమంది ఉరి..

దొంగదెబ్బతో బంధించిన రాంజీ సహా వెయ్యి మందిని శత్రుసేనలు చిత్రహింసలు పెట్టాయి. ఇలాంటి వాళ్లు మళ్లీ తమపై పోరాడేందుకు కూడా సాహించకూడదని నరకం చూపించాయి. వారందరినీ నిర్మల్ శివారులోని ఎల్లపెల్లి దారిలో నేలలో ఊడలు దిగిన మర్రిచెట్టు వద్దకు ఈడ్చుకెళ్లి అందరూ చూస్తుండగా రాంజీ సహా వెయ్యి మందిని 1860 ఏప్రిల్ 9న ఉరితీశారు. దేశ స్వాతంత్య్ర చరిత్రలోనే మునుపెన్నడూ జరగని ఈ ఘటన జలియన్‌వాలాబాగ్ కంటే దాదాపు 60 ఏళ్ల ముందే చోటు చేసుకోవడం గమనార్హం. ఆ దారుణం కంటే ఇక్కడ ఎక్కువమందే ప్రాణత్యాగాలు చేసినా.. చరిత్రలో సరైన గుర్తింపు దక్కకపోవడం శోచనీయమని నిర్మల్ జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్మల్‌గడ్డపై జరిగిన పోరుకు, వారి త్యాగాల తీరుకు తగిన గుర్తింపు తీసుకురావాలని కోరుతున్నారు.

'సాక్షి' అక్షర నివాళులు..

స్వాతంత్రం కోసం సర్వస్వం అర్పించిన సమరయోధులనూ గుర్తించాలని, రాంజీసహా వెయ్యిమంది అమరవీరుల త్యాగాలకు విలువనివ్వాలని అవకాశం దొరికినప్పుడల్లా.. 'సాక్షి' గొంతెత్తుతూనే ఉంది. వరుస కథనాలను ప్రచురిస్తూ.. ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ నాటి చరితను, వారి ఘనతను ప్రజల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. వెయ్యిమంది వీరుల త్యాగాలదినం సందర్భంగా బుధవారం నిర్మల్ పట్టణంలోని డాక్టర్స్‌లైన్‌లో గల డా.కావేరి లైబ్రరీలో సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

బళ్లారి నుంచి దళం..

రాంజీసేనల దాడుల విషయం కలెక్టర్ ద్వారా హైదరాబాద్ రాజ్యంలో అప్పటి రెసిడెంట్ డేవిడ్సన్, నాటి పాలకుడు అఫ్జల్‌ఉద్దౌలా వరకు తెలిసింది. వీరి పోరును తీవ్రంగా పరిగణించిన పాలకులు అణచివేత కోసం కర్ణాటకలోని బళ్లారిలో ఉన్న 47వ నేషనల్ ఇన్‌ఫ్రాంటీని నిర్మల్ రప్పించారు. కల్నల్ రాబర్ట్ నేతృత్వంలోని ఈ దళానికీ ఇక్కడి ప్రాంతంపై పట్టులేకపోవడంతో రాంజీసేన చేతిలో దెబ్బతింది. ఈ కసితో కల్నల్ రాంజీసేనను దొంగదెబ్బ తీసి, సోన్–కూచన్‌పల్లి ప్రాంతంలో గోదావరి ఒడ్డున పట్టుకున్నాడు.

మనవంతు ప్రయత్నం..



జిల్లాలో ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్నాయి. వెయ్యి ఉరులమర్రి ఘటన ఇక్కడే చోటు చేసుకుంది. వీటిని ముందుతరాలకు అందించేందుకు మావంతు ప్రయత్నం కొనసాగుతోంది. – అభిలాష అభినవ్, కలెక్టర్

అమరధామం కోసం..



నిర్మల్‌గడ్డపై పోరాడి ప్రాణత్యాగం చేసిన రాంజీసహా వెయ్యిమంది వీరులను ప్రతీఒక్కరం స్మరించుకోవాలి. వారిత్యాగాల స్ఫూర్తిని ముందుతరాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. నిర్మల్‌లోనూ అమరధామం ఏర్పాటు దిశగా ప్రయత్నం చేస్తున్నాం.
– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేఎల్పీనేత

వారి ఆశయాల కోసం..



రాంజీసహా వెయ్యిమంది వీరుల ఆశయాల కోసం పనిచేద్దాం. గతంలో గద్దర్, ప్రజాసంఘాలతో కలిసి నిర్మల్‌లో అమరవీరుల స్థూపం ఏర్పాటుకు కృషిచేశాం. హైదరాబాద్‌లో రాంజీ మ్యూజియం ఏర్పాటవుతోంది. నిర్మల్‌లోనూ స్మారకం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
– అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీమంత్రి

ప్రభుత్వానికి విన్నవిస్తాం



నిర్మల్‌గడ్డపై జరిగిన అసమాన పోరాటం, రాంజీ సహా వెయ్యి మంది అమరులకు సరైన గుర్తింపు దక్కలేదన్నది వాస్తవం. వారి ప్రాణత్యాగం ముందుతరాలకూ తెలిసేలా అందరం ప్రయత్నించాలి. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికీ విన్నవిస్తాం.
– కూచాడి శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షుడు

ఇప్పటికైనా గుర్తించాలి..



ప్రథమ భారత సంగ్రామంలోనే నిర్మల్ గడ్డ భాగమైంది. రాంజీసహా వెయ్యి మంది వీరులు మన నేలపైనే ప్రాణత్యాగం చేశారు. ఇప్పటికైనా వారి త్యాగాలకు ప్రభుత్వాలు అధికారికంగా నివాళులర్పించాలి. – పోలీస్ భీమేశ్, రాంజీగోండు స్మారక సమితి

ప్రదర్శనకు ఎంపికైన చిత్రం


చిత్రాన్ని గీస్తున్న శ్రీనివాస్

జైపూర్: ప్రముఖ చిత్రకారుడు, శిల్పి ఏలూరి శేషబ్రహ్మం కాకతీయ శిల్ప సంపద గురించి తెలుసుకునేందుకు జనవరి 25, 26 తేదీల్లో నిర్వహించిన కాకతీయ టెంపుల్ స్కెచింగ్ స్టడీ టూర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 60 మంది ఆర్టిస్టులు పాల్గొని పలు చిత్రాలు గీశారు. వాటిలో నుంచి ఎంపికైన చిత్రాలతో ఈ నెల 12 నుంచి 14 వరకు మాదాపూర్‌లోని తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఇందులో మంచిర్యాల జిల్లాకు చెందిన చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్ కాకతీయ శిల్పసంపదపై గీసిన చిత్రం ప్రదర్శనకు ఎంపికైంది.

మట్కా నిందితుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అగ్ని బాబులాల్ అమాయక ప్రజలకు మట్కా చీటీలు అందజేస్తూ పట్టుబడినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తాంసి బస్టాండ్ వద్ద మట్కా చీటీలు రాస్తుండగా దాడిచేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.730 నగదుతో పాటు సెల్‌ఫోన్, మట్కా పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆన్‌లైన్ మట్కా నిర్వాహకుడు..

ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మసూద్ ఖాన్ ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహణ చేస్తున్నాడు. మహారాష్ట్రలోని గుర్లాయికి సంబంధించిన సంస్థకు డబ్బులు పంపిస్తుండగా పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. నిందితుడి నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లతో పాటు రూ.5,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు వివరించారు.

ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాయినాథ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పూసాయి గ్రామ శివారులో మంగళవారం మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. మంగళవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై పురుషోత్తం, ఏఎస్సై సిరాజ్ ఖాన్, కానిస్టేబుళ్లు శివాజీ, స్వామి దాడులు నిర్వహించి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన కడదారపు గంగన్న, తాంసి మండలంలోని హస్నాపూర్‌కు చెందిన రాకేందర్‌ల నుంచి రూ.4,100 నగదుతో పాటు సెల్‌ఫోన్, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మహారాష్ట్రలోని బోరికి చెందిన గజ్జుకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. జైనథ్ మండలంలో మట్కా, పేకాట, దేశీదారు వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 8712659916, 8712659929 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రం శివారులోని బొమ్మరిల్లు టౌన్‌షిప్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. సోమవారం రాత్రి దొంగలు ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బెడ్‌రూంలో బీరువాలో ఉన్న నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన శ్రీకాంత్‌రెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్సై లింబాద్రి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య


దుర్గం రాము (ఫైల్)

కోటపల్లి: ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల మేరకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం రాము (23) ఇంటి వద్దే ఉంటూ తండ్రితో పాటు వ్యవసాయ పనులకు వెళ్తుండేవాడు. తాను ప్రేమించిన యువతి ప్రేమకు నిరాకరించడంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్‌లో పశువుల వ్యాపారి..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ సిద్దిఖీ (35) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. పశువుల వ్యాపారం చేస్తున్న ఫిరోజ్ సిద్దిఖీకి నష్టం రావడంతో అప్పుల బాధ తాళలేక అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించగా మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక..

ఇచ్చోడ: మనస్తాపంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముకురా(బి)కి చెందిన రఫీక్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో గొడవలకు దిగేవాడు. దీంతో మనస్తాపానికి గురైన అతని కుమార్తె పిర్దోసి (16) మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. మృతిరాలి తల్లి జాబినాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ఏడాది జైలుశిక్షతో పాటు అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించాలని స్థానిక సివిల్ కోర్టు జడ్జి కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎస్.పారిజాత మంచిర్యాలకు చెందిన గుమ్మి జగన్నాథ్‌రెడ్డి వద్ద రూ.12లక్షలు అప్పుగా తీసుకుంది. ఒప్పందం ప్రకారం పారిజాత చెక్కులను అందజేసింది. గడువు తీరిన తర్వాత చెక్కును స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. దీంతో జగన్నాథ్‌రెడ్డి 2017లో కోర్టును ఆశ్రయించగా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సంధ్యారాణి(ఫైల్)

జైపూర్: జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన సంధ్యారాణి (40) కుటుంబసభ్యులతో కలసి మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చింది. కారులో స్వగ్రామానికి వెళ్తుండగా ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులను చూ సి పరుగులు తీయడంతో అనుమానం వచ్చి వారిని వెంబడించగా 210 గ్రాముల గంజాయి లభించింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనంతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

యాక్సిడెంట్ కేసులో నిందితునికి జైలు

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి తొమ్మిది నెలల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నిర్మల్ కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. 2016లో సోన్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గంగయ్య మృతి చెందగా అతని భార్యసంగర్తనకు గాయాలయ్యాయి. ఇందుకు కారణమైన కొండ సంతోశ్‌గౌడ్‌కు న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

12 డొమెస్టిక్ సిలిండర్ల సీజ్


పట్టుబడిన సిలిండర్లు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, స్వీట్‌హౌజ్‌లలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించి 12 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రేంని వాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లు కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వాడాలని సూచించారు.

ప్రమాదంలో భగీరథ


బూరుగుపల్లి శివారులో మట్టి కొట్టుకుపోవడంతో బయటకు కనిపిస్తున్న భగీరథ పైపులైన్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాటేగాం నుంచి ఆదిలాబాద్ జిల్లాతో పాటు అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి వేసిన మిషన్ భగీరథ పైపులు మామడ మండలం బూరుగుపల్లి, మొండిగుట్ట అటవీప్రాంతంలో 44 నంబర్ జాతీయ రహదారి సమీపంలో ప్రమాదకరంగా మారాయి. గుట్ట ప్రాంతం నుంచి వచ్చిన వరదకు పైపులైన్ మట్టి కొట్టుకుపోయింది. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ పైపులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


పై పెచ్చులు ఊడి ప్రమాదకరంగా కనిపిస్తున్న మిషన్ భగీరథ పైపులైన్


గాలిలో తేలియాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్న భారీ పైపులైన్

గుట్టుగా గంజాయి దందా..


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

ఉట్నూర్‌రూరల్: మండలంలో గంజాయి దందా గుట్టుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 2 కిలోల గంజాయి పట్టుబడింది. ఆదివారం రాత్రి రాములుగూడెంలో రైతు సాగు చేస్తున్న 20 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మంగళవారం ఉట్నూర్ ఇన్‌చార్జి ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో బీర్సాయిపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని లక్సెట్టిపేటకు చెందిన సట్ల గంగన్న , బీర్సాయిపేటకు చెందిన జైనేని ఎల్లయ్య అనుమానస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 4.900 గంజాయి లభించింది. గంజాయి విలువ రూ.లక్షా 22 వేలు ఉంటుందన్నారు. వారిని విచారించగా మహారాష్ట్రకు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్ కరీంనగర్ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాజీ ఎంపీపీ మంగళ సూత్రం చోరీ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడకు చెందిన బెజ్జూర్ మాజీ ఎంపీపీ రోజారమణి మంగళ సూత్రాన్ని గుర్తుతెలియని దుండగులు అపహరించారు. మంగళవారం ఉదయం ఇంటి బయట పనులు చేసుకుంటుండగా ఇద్దరు దుండగులు పూల కోసం వచ్చి ఆమె మెడలోని మంగళ సూత్రాన్ని లాక్కుని వెళ్లిపోయారు. వెంటనే బాధిత మహిళ 100 కు ఫోన్ చేయడంతో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈసందర్భంగా బాధిత మహిళ మాట్లాడుతూ రెండు రోజులుగా ఇంటి ముందు నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వాకింగ్ చేస్తున్నారని, అయితే చోరీ జరిగిన సమయంలో మాస్కులు ధరించి ఉన్నారన్నారు.